క్లుప్తంగా

నేడు వలంటీర్లకు సన్మానం

చిట్వేలి : స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు మండలంలోని వలంటీర్లకు సన్మాన కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీఓ వెంకట రంగారావు సోమవారం తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రైల్వేకోడూరు ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు హాజరవుతున్నట్లు వారు తెలిపారు. కావున ఎంపీపీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు హాజరు కావాల్సిందిగా ఎంపీడీఓ కోరారు. కావున పంచాయతీ కార్యదర్శులు, ఆయా సచివాలయం పరిధిలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు సన్మాన గ్రహీతులైన వలంటీర్లకు, ప్రజాప్రతినిధులు, విలేకరులకు తెలియజేసి వారు హాజరయ్యే విధంగా చూడాలని ఆదేశించారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

ఓబులవారిపల్లె : స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నేడు మంగళవారం ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు వలంటీర్లకు నిర్వహించే సన్మాన కార్యక్రమంలో పాల్గొననున్నట్లు ఎంపీడీఓ కుళ్లాయప్ప సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు స్థానిక ఎంపీడీఓ సభా భవనంలో సేవా అవార్డులు పొందినవారికి అవార్డుల ప్రదానంతో పాటు సత్కరించనున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు, ఏపీటీడీసీ డైరెక్టర్ సాయికిషోర్ రెడ్డిలు హాజరవుతారన్నారు. పంచాయతీ కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు తప్పకుండా హాజరుకావాలని ఆయన కోరారు.

రేపు మండల సమావేశం

సిద్దవటం : సిద్దవటం మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని బుధవారం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన సోమవారం మాట్లాడుతూ సిద్దవటం మండల సర్వసభ్య సమావేశం బుధవారం ఉదయం 10:00 గంటలకు మండల పరిషత్ సభా భవనంలో మండల అధ్యక్షురాలు జ్యోతి వెంకటమ్మ అధ్యక్షతన జరుగుతుందన్నారు. సమావేశంలో వివిధ ప్రభుత్వ శాఖల అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష చేస్తారన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సభకు తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన కోరారు.


విద్యాబోధనపై శిక్షణ



ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమంలో ఎంఈఓ

పుల్లంపేట : మండల పరిధిలోని అనంతంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం మండలంలోని ఉపాధ్యాయులకు ఎంఈఓ చక్రాధర్ రాజు, నాగా తిరుమలరావు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు ఒక రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపి వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. విద్యార్థులు బాగా చదివి మంచి మార్కులు సాధించి తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచిపేరు తీసుకురావాలని సూచించారు.


పీహెచ్‌సీ తనిఖీ



వైద్య పరికరాన్ని తనిఖీ చేస్తున్న ఏఎంఓ

ఒంటిమిట్ట : మండల కేంద్రంలోని పీహెచ్‌సీని సోమవారం ఏఎంఓ జి.వెంకటరెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. పీహెచ్‌సీలోని ల్యాబ్‌లను పరిశీలించి, అనంతరం ఒంటిమిట్టలో మురుగునీరు నిల్వ ఉన్న ప్రాంతాలను పరిశీలించి మురుగునీరుకు తొలగించి, దోమల ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని పీహెచ్‌సీ సిబ్బందికి సూచనలు, సలహాలు ఇచ్చారు.

పరామర్శ



నారాయణను పరామర్శిస్తున్న ఎంపీపీ

లక్కిరెడ్డిపల్లె : మద్దిరేవుల గ్రామం ఈడిగపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు నారాయణను సోమవారం ఎంపీపీ సుదర్శన్ రెడ్డి, రామాపురం ఏపీఓ సురేంద్రనాథ్ రెడ్డిలు పరామర్శించారు. అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స నిమిత్తం ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్న నారాయణను పరామర్శించారు. అనంతరం అదే గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ యువనాయకులు హరికి చెందిన నూతన గృహ ప్రవేశం కార్యక్రమంలో పాల్గొన్నారు.

మద్యం పట్టివేత

పెద్దతిప్పసముద్రం: టి.సదుం సమీపంలోని అంకాలమడుగు చెక్‌పోస్టు వద్ద ఎస్‌ఐ రవీంద్రబాబు సోమవారం సిబ్బందితో కలసి నాకాబందీ నిర్వహించారు. కదిరికి చెందిన గోవర్దన్ (26) కర్ణాటక నుంచి 48 ప్యాకెట్ల మద్యాన్ని అక్రమంగా తరలిస్తూ పట్టుబడ్డాడు. అతడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపామని ఎస్‌ఐ పేర్కొన్నారు.

వలంటీర్ల సేవలు అమోఘం

- పథకాలు కొనసాగాలంటే వైఎస్సార్‌సీపీనే గెలవాలి
- ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు, స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ అజయ్ రెడ్డి



పెనగలూరు: వలంటీర్ గోర్ల దీప్తిని సన్మానిస్తున్న నాయకులు, అధికారులు



రైల్వేకోడూరు అర్బన్: నాయకులతో సమీక్షిస్తున్న ప్రభుత్వవిప్ కొరముట్ల

పెనగలూరు (ఓబులవారిపల్లె): వలంటీర్ వ్యవస్థ ప్రపంచానికే ఆదర్శమని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు, రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ కొండూరు అజయ్ రెడ్డిలు అన్నారు. సోమవారం సాయంత్రం ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో వలంటీర్ల సేవలకు గుర్తింపుగా సేవా మిత్ర, సేవా రత్న, సేవా వజ్ర పురస్కారాల అందజేత కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. మండలం నుంచి సేవా మిత్రకు ఆరు మంది ఎంపిక కాగా వారిని ఘనంగా సన్మానించి ప్రశంసాపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కొరముట్ల మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి వలంటీర్ వ్యవస్థను తీసుకువచ్చారన్నారు. ఈ వ్యవస్థ సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేసిందని తెలియజేశారు. నవరత్నాలు ప్రజలకు చేరవేయడంలో వలంటీర్ల కృషి అమోఘమన్నారు. వారి కృషికి ఫలితంగా వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి నగదుతోపాటు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అంతకుముందు కొండూరు అజయ్ రెడ్డి మాట్లాడుతూ వలంటీర్ల వ్యవస్థను సీఎం జగన్‌మోహన్ రెడ్డి తీసుకువచ్చి లక్షలాది కుటుంబాలకు ఉపాధి కల్పించారన్నారు. రైల్వేకోడూరు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులను అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం వలంటీర్లు పందికాళ్ల చిన్నయ్య, గోర్ల దీప్తి, పెంచలయ్య, వెంకటేష్, లక్ష్మీకృష్ణయ్య, కవితలను శాలువాకప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ హరిప్రసాద్ రెడ్డి, తహసీల్దార్ ఇంద్రాణి, జెడ్పీటీసీ సుబ్బరాయుడు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కేతా చక్రపాణి, సాతుపల్లి రెడ్డివారి సుబ్బారెడ్డి, వ్యవసాయ సలహామండలి అధ్యక్షులు శ్రీనివాసులు రెడ్డి, వైఎస్సార్‌సీపీ యువనాయకుడు రాఘవరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, సీనియర్ నాయకుడు బీఎల్ నరసింహారెడ్డి, మండల కో–ఆప్షన్ మెంబర్ లాడెన్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పథకాలు ప్రతి ఓటరుకు తెలియజేయండి

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు పట్టణంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు నియోజకవర్గ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలు, అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని తెలిపారు. రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి సహకారంతో నియోజకవర్గంలో అన్ని మండలాలలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేసిన తీరును కార్యకర్తలు, నాయకులు ప్రతి ఓటరుకు తెలియజేయాలన్నారు. గత ప్రభుత్వాలు 70 ఏళ్లలో చేయని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు కేవలం ఈ ఐదు సంవత్సరాలలో జగనన్న సహకారంతో పూర్తి చేశామని పేర్కొన్నారు. అలాగే ప్రజాదర్బార్‌లో సమస్యలు పరిష్కరించామన్నారు. కార్యక్రమంలో నాయకులు సీడీ నాగేంద్ర, చంద్రమోహన్ రెడ్డి, మలిశెట్టి వెంకటరమణ, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

నివాళి

రైల్వేకోడూరు : పట్టణంలోని అరుంధతివాడకు చెందిన కోడూరు సుబ్రమణ్యం అనారోగ్యంతో మృతి చెందడంతో హుటాహుటిన ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అలాగే సోమవారం వారి కుటుంబానికి భరోసా కల్పించారు. కార్యకర్తలను, నాయకులను ఆదుకోవడంలో వైఎస్సార్‌సీపీ సిద్ధంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు రాజారెడ్డి, హరికృష్ణారెడ్డి, నాయకులు నందా బాల తదితరులు పాల్గొన్నారు.

జగనన్నకు తోడుగా ఉండాలి



వీరబల్లె మండలంలో వలంటీర్లను సన్మానిస్తున్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి

- జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి

వీరబల్లి(రాజంపేట) : వలంటీర్లు జగనన్నకు తోడుగా ఉండాలని జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి అన్నారు. సోమవారం ఓదవీడు పంచాయితీలో వలంటీర్లకు పురస్కారాల అభినందన సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆకేపాటి మాట్లాడుతూ ప్రతి వలంటీరు ఒక సైనికుడిగా పని చేయాలన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రి చేసుకోవాలని పిలుపునిచ్చారు. వలంటీర్ వ్యవస్థ ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేశారన్నారు. వారి సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథరెడ్డి, యువనేత గాలివీటి విజయసాగర్‌రెడ్డి(మదన్‌రెడ్డి), జిల్లా బీసీ సంఘం అధ్యక్షుడు నాగభూషణం, సర్పంచులు నాగిరెడ్డి, గోపినాథరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు అమర్‌నాథరెడ్డి, మాజీ సర్పంచి రామచంద్రారెడ్డి, ఓదివీడు వైఎస్సార్‌సీపీ నాయకులు శివ, ఎంపీడీఓ రామచంద్రారెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల సమస్యలు సత్వరమే పరిష్కరించండి



సమస్యలపై మాట్లాడుతున్న సాయికిశోర్ రెడ్డి

ఓబులవారిపల్లె : స్పందన కార్యక్రమానికి మండల నలుమూలల నుంచి వచ్చే రైతుల సమస్యలు సత్వరమే పరిష్కరించాలని ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలపై తహసీల్దార్ శేషగిరి రావుకు రైతులు వినతిపత్రాలు అందజేశారు. అనంతరం సాయికిషోర్ రెడ్డి మాట్లాడుతూ ప్రధానంగా ఆన్‌లైన్‌లో సవరణలు, మార్పులు, చేర్పులు క్షేత్రస్థాయిలో పరిశీలించి వెంటనే పరిష్కరించాలని తహసీల్దార్‌ను కోరారు. అదే విధంగా రేషన్ కార్డులు, ఆధార్ సమస్యలు వెంటనే పరిష్కరించాలని తహసీల్దార్‌తో అన్నారు. సర్వేకు సంబంధించి ప్రజలు, రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలియజేశారు. ఇందుకు తహసీల్దార్ స్పందిస్తూ సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వరమే పరిష్కరిస్తామని అన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు తల్లెం రమణారెడ్డి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు పోలి పాపిరెడ్డి, సర్పంచ్‌లు జరుగు నారాయణ రెడ్డి, నరేంద్రరాజు, మాజీ ఎంపీపీ రామకృష్ణయ్య, ఎంపీటీసీలు పైడి గిరినాయుడు, దుర్గా ప్రసాద్, నరసింహ, కో–ఆప్షన్ మెంబర్ షేక్ మౌలానా, వైఎస్సార్ పార్టీ నాయకులు టంగుటూరు రాజశేఖర్ రెడ్డి, ఉమా శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న ఎంవీఐ వినోద్‌కుమార్

రాజంపేట : ప్రతి ఒక్క వాహనదారుడు రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలని రాజంపేట ఎంవీఐ బి.వినోద్‌కుమార్ అన్నారు. సోమవారం అన్నమాచార్య ఫార్మసీ కళాశాలలో రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా యువత మొబైల్ ఫోన్ మాట్లాడుతూ బైకు, కారులు నడపరాదన్నారు. మద్యం సేవించి వాహనాల నడపడం వల్ల ప్రమాదాలకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. త్రిపుల్ రైడింగ్ చేయరాదన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలను అమలు చేయాల్సిందేనని చెప్పారు. డ్రైవింగ్ లైసెన్స్ తప్పనసరిగా ఉండాలన్నారు. డ్రైవింగ్ విషయంలో అవగాహన కొరవడి ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. ప్రభుత్వం రోడ్డు భద్రతా వారోత్సవాలను నిర్వహించి ప్రజలకు రహదారి భద్రతా నియమాలను తెలిజేస్తోందన్నారు. మోటారు వాహనాల చట్టం గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ స్వర్ణలత, ఫార్మసీ కళాశాల సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

హంద్రీ–నీవా కాలువ గట్టు ఆక్రమణపై ఫిర్యాదు

మదనపల్లె : మండలంలోని కొత్తపల్లె పంచాయతీలో హంద్రీనీవా కాలువ గట్టుపైన కొందరు రియల్టర్లు అక్రమంగా తారురోడ్డు నిర్మాణం చేస్తున్నారని మాలమహానాడు జిల్లా ఉపాధ్యక్షులు గుండామనోహర్ సోమవారం హెచ్ఎన్ఎస్ఎస్ సూపరింటెండెంట్ శ్రీధర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... హంద్రీనీవా కాలువకు ఆనుకుని కొందరు రియల్‌ఎస్టేట్ వ్యాపారులు వెంచర్లు వేయడమే కాకుండా, లేఅవుట్‌లోకి వెళ్లేందుకు హంద్రీనీవా స్థలాన్ని వినియోగిస్తున్నారన్నారు. కాలువకు ఇరువైపులా ప్రభుత్వ స్థలం ఎంత ఉందనే విషయమై అధికారులు ఒకసారి క్షేత్రస్థాయి పరిశీలన చేస్తే బాగుంటుందని కోరారు. ప్రభుత్వస్థలం సరిహద్దులు తెలిపేలా రాళ్లు ఏర్పాటుచేయాలన్నారు. హంద్రీనీవా కాలువ గట్టుపై తారురోడ్డు నిర్మాణం చేపట్టిన రియల్ ఎస్టేట్ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

విశ్రాంతి గది నిర్మాణానికి భూమిపూజ

తంబళ్లపల్లె: మల్లయ్యకొండపై వెలసిన భ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామి ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం విశ్రాంతి గది నిర్మాణానికి సోమవారం భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి సూచనల మేరకు ఎద్దులవారిపల్లె పంచాయితీ గొడసానివారిపల్లెకు చెందిన వాటర్‌షెడ్ చైర్మన్ నరసింహారెడ్డి వెలుగు మల్లమ్మ ఆలయం పక్కన సొంత నిధులు సుమారు రూ.3 లక్షలతో గదిని నిర్మిస్తున్నారు. ఆయనను ఆలయ కమిటీ చైర్మన్ మల్‌రెడ్డి, ధర్మకర్త ప్రభాకర్‌రెడ్డి అభినందించారు.

స్పందన సమస్యలు పరిష్కరించండి

పుల్లంపేట : స్పందన ద్వారా వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని తహసీల్దార్ నరసింహకుమార్ వీఆర్‌ఓలను ఆదేశించారు. సోమవారం స్పందన ద్వారా పలు అర్జీలు అందాయని, వాటిని తక్షణమే పరిష్కరించేందుకు సంబంధిత అధికారులకు తెలియజేసినట్టు పేర్కొన్నారు. త్వరలో ఎన్నికలు సమీస్తున్న నేపథ్యంలో బీఎల్‌ఓలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ముద్దా బాబుల్ రెడ్డి, ఆర్ఐ నవీన్ కుమార్, వీఆర్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

విరాళం అందజేత



విరాళం అందజేస్తున్న దాతలు

సంబేపల్లె : మండల కేంద్రంలోని గుహేశ్వరీ పసుపతినాథ ఆలయ నిర్మాణ నిమిత్తం ప్రకాష్ నగర్ కాలనీ, మిన్నమరెడ్డిగారిపల్లెకు చెందిన రెడ్డమ్మ, రంగమ్మ, రామలక్ష్మమ్మ, మహేష్‌ల కుటుంబసభ్యులు కలిసి రూ. 25 వేలు విరాళం అందజేశారు. దాతలచే ప్రత్యేక పూజలు నిర్వహింపచేసి సత్కరించారు. కార్యక్రమంలో వివి ప్రతాప్ రెడ్డి, కగేంద్రరాజు, ఆర్ఎంపీ వీరశంకర్, యర్రయ్య తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం.. 48వ వారం



అన్నదానంలో పాల్గొన్న అర్జీదారులు

రాయచోటి అర్బన్ : జిల్లా కేంద్రమైన రాయచోటిలోని కలెక్టరేట్ ఆవరణలో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదానం సోమవారం జరిగింది. కలెక్టర్, ఎస్పీ కార్యాలయాలకు విచ్చేసే అర్జీదారులకు గత 47 సోమవారాలు అన్నదానం చేస్తున్న సంగతి విదితమే. కాగా ఈ రోజు గ్రీవెన్స్ వచ్చిన ప్రజలకు రుచికరవమైన భోజనాన్ని అందించారు. అర్జీదారులకు అన్నదానం ఏర్పాటు చేయడం హర్షణీయమంటూ ప్రజలు అభినందిస్తున్నారు.

సారా తయారీకి దూరంగా ఉండాలి

బి.కొత్తకోట: నాటుసారా తయారీ, విక్రయాలకు, కర్ణాటక మద్యం అక్రమంగా తరలింపునకు దూరంగా ఉండాలని సీఐ సూర్యనారాయణ కోరారు. సోమవారం మండలంలోని అటవీ సరిహద్దు గ్రామాలైన మొటుకుపల్లె, పులుసుమానిపెంట, అరిమానిపెంట, చిన్నపల్లె, నాయనబావి పంచాయతీల్లో పర్యటించారు. గ్రామస్తులను కలిసి వారితో ఎన్నికల దృష్ట్యా పోలీసులకు సహకరించాలని కోరారు. చట్ట విరుద్ధమైన పనులు, కార్యక్రమాలకు దూరంగా ఉండాలని, గ్రామాల్లో ప్రశాంత వాతావరణ నెలకొనేలా అందరు సహకారం అందించాలని పేర్కొన్నారు.

21న మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యవర్గ సమావేశం

పెద్దతిప్పసముద్రం: తాడేపల్లిలో ఈ నెల 21న వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహిస్తున్నట్లు మైనార్టీ సెల్ విభాగం రాష్ట్ర కార్యదర్శి రియాసత్ అలీఖాన్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పార్టీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామక్రిష్ణారెడ్డి, మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి ఖాదర్‌బాషా అధ్యక్షతన జరిగే సమావేశంలో మైనార్టీ విభాగం చేపట్టవలసిన కార్యాచరణపై చర్చిస్తారన్నారు. ఈ మేరకు తనకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఆహ్వానం అందిందని రియాసత్ పేర్కొన్నారు.

ఏపీపీఆర్ఎంఈ అసోసియేషన్ ఎన్నిక ఏకగ్రీవం



ఎన్నికైన వారికి ధృవీకరణ పత్రాలను అందజేస్తున్న ఎన్నికల అధికారులు

ఒంటిమిట్ట : ఒంటిమిట్టలో జరిగిన ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్, సిద్దవటంకు సంబంధించిన ఎన్నిక ఏకగ్రీవమైంది. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన ఎన్నికలను ఎన్నికల అధికారులు కుమార రంగయ్య, లంక మల్లేశ్వర్ రెడ్డి నిర్వహించారు. ఈ సందర్భంగా ఏకగ్రీవంగా ఎన్నికైన అసోసియేషన్ సభ్యులకు ఎన్నికల అధికారులు ధృవీకరణ పత్రాలను అందజేశారు. అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా ఒంటిమిట్ట మండల పరిషత్ కార్యాలయంకు చెందిన అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ బి.సోమశేఖర్, వైస్ ప్రెసిడెంట్‌గా సీనియర్ అసిస్టెంట్ జి.వరప్రసాద్‌ను, జనరల్ సెక్రటరీగా ఒంటిమిట్ట జెడ్పీహెచ్ఎస్‌లోని జూనియర్ అసిస్టెంట్ ఎం.గోపినాథ్, జాయింట్ సెక్రటరీగా అట్లూరు మండల పరిషత్‌లోని టైపిస్టు గౌస్ పీర్, ట్రెజరర్‌గా సిద్దవటం జెడ్పీహెచ్ఎస్‌లోని రికార్డు అసిస్టెంట్ జి.శ్రీనివాసులు, డిస్ట్రిక్ట్ కౌన్సిలర్ – 1గా సిద్దవటం మండల పరిషత్‌లోని సీనియర్ అసిస్టెంట్ సుబ్రమణ్యం, డిస్ట్రిక్ట్ కౌన్సిలర్ – 2 గా ఒంటిమిట్ట జెడ్పీహెచ్ఎస్‌లోని రికార్డు అసిస్టెంట్ పి.వెంకటసుబ్బమ్మలు ఎన్నికయ్యారు.

బదిలీ తహసీల్దార్‌తో లబ్ధిదారులకు అన్యాయం!



న్యాయం చేయాలని ఎంపీపీ మేడా వద్ద మొరపెట్టుకుంటున్న లబ్ధిదారులు

నందలూరు(రాజంపేట) : నందలూరు తహసీల్దార్‌గా ఉండి రాజంపేట ఆర్డీఓ కార్యాలయానికి బదిలీ అయిన సత్యానందం వల్ల హౌసింగ్ లబ్ధిదారులకు అన్యాయం జరిగిందని వైఎస్సార్‌సీపీ మహిళా అధ్యక్షురాలు పల్లె మాధవి ఆరోపించారు. సోమవారం మండల అధ్యక్షుడు మేడా విజయ్‌భాస్కర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాగిరెడ్డిపల్లె, నందలూరు గ్రామ పంచాయతీల పరిధిలో జగనన్న కాలనీల కోసం ఎంపికైన అర్హులైన లబ్ధిదారులకు గత తహసీల్దార్ అర్హులైన లబ్ధిదారులకు ఆన్‌లైన్‌లో రిజెక్ట్ చేశారన్నారు. అర్హులైన లబ్ధిదారులకు పక్కా గృహాలు రాకుండా చేశారన్నారు. పరోక్షంగా ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకువచ్చేలా వ్యవహరించారన్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని లబ్ధిదారులకు న్యాయం చేయాలని ఎంపీపీని కోరారు. దీనిపై ఎంపీపీ సానుకూలంగా స్పందించారు. ఎమ్మెల్యే, కలెక్టర్, ఎంపీ దృష్టికి తీసుకెళ్తామని తెలియజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షులు అన్నం నాగేంద్రమూర్తి, వైస్ ఎంపీపీ నాయనపల్లి అనుదీప్, జై సింహ, బీసీ నాయకులు హిమగిరినాథ్ యాదవ్, జేసీఎస్ సచివాలయ కన్వీనర్ వాణి, లబ్ధిదారులు పాల్గొన్నారు.

జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలి



సంతకాల సేకరణను ప్రారంభిస్తున్న ప్రజాసంఘాలు

రాయచోటి అర్బన్ : జనాభా ప్రాతిపదికన బీసీలకు రిజర్వేషన్లను కల్పించాలని బీఎస్పీ రాయచోటి ఇన్‌చార్జ్ నాగార్జున, ప్రజా సంఘాల నేతలు ఈశ్వర్, రెడ్డెయ్య, నాగమునిలు డిమాండ్ చేశారు. స్థానిక అంబేడ్కర్ చిత్రపటం వద్ద సోమవారం మధ్యాహ్నం బీఎస్పీ ఆధ్వర్యంలో లక్ష సంతకాల సేకరణ కార్యక్రమం జరిగింది. నేతలు మాట్లాడుతూ రిజర్వేషన్‌ల అమలులో బీసీలకు అడుగడుగునా అన్యాయం జరుగుతోందన్నారు. 52 శాతం ఉన్న బీసీలకు న్యాయం జరగాలన్న డిమాండ్‌తో లక్ష సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. జనాభాలో 52 శాతం ఉన్న బీసీలకు అన్ని రంగాలలో 52 శాతం రిజర్వేషన్‌లు కల్పించాలన్నారు. బీఎస్పీ రాయచోటి ఇన్‌చార్జ్ మాట్లాడుతూ సంతకాల సేకరణ పూర్తయిన తర్వాత ప్రతులను ఉమ్మడి రాష్ట్రాల బీఎస్పీ ఇన్‌చార్జ్ రాంజీ గౌతమ్‌కు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ నేత నిరంజన్, న్యాయవాదులు షరీఫ్, రాజ్‌కుమార్, రమణ, వడ్డెర విద్యావంతుల వేదిక మారుతిశంకర్, బంజారా సంఘం నేత శంకర్‌నాయక్, నేతలు చాట్ల వీరయ్య, నరసింహ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అందరి సంక్షేమమే సీఎం లక్ష్యం



బలిజపల్లెలో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

రాజంపేట టౌన్ : రాష్ట్ర ప్రజల సంక్షేమమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని మున్సిపాలిటీ పరిధిలోని బలిజపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు తెలిపారు. బలిజపల్లెలో సోమవారం గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు బోనం మోహన్, కోనిశెట్టి రెడ్డయ్య, గుగ్గిళ్ల గంగయ్య, గుగ్గిళ్ల రెడ్డిప్రసాద్ ఆధ్వర్యంలో గడప గడపకూ వైఎస్సార్ సీపీ కార్యక్రమాన్ని ముమ్మరంగా చేపట్టారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికి వెళ్లి జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ప్రతి కుటుంబానికి మేలు చేసిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. పేదలకు సంక్షేమ పథకాలు ఇదే విధంగా కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటువేయాలని వారు కోరారు. రాజంపేట నియోజకవర్గ ప్రజలకు ఎప్పుడు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలు పరిష్కరించే ఆకేపాటి అమర్‌నాథరెడ్డిని ఎమ్మెల్యేగా, పెద్దిరెడ్డి మిథున్ రెడ్డిని ఎంపీగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ అభిమానులు పాల్గొన్నారు.

సిద్దవటంలో ఆర్థిక అక్షరాస్యత కేంద్రం



కేంద్రాన్ని ప్రారంభించిన బ్యాంక్ అధికారులు

సిద్దవటం : ఆర్‌బీఐ ఆదేశాల మేరకు వలంటరీ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత కేంద్రాన్ని సిద్దవటంలో ప్రారంభించామని సిద్దవటం ఎస్‌బీఐ మేనేజర్ డేవిడ్‌రాజు, ఏపీజీబీ మేనేజర్ గంగాదేవిలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిద్దవటం, రాజంపేట, చింతకొమ్మదిన్నె మండలాలకు సంబంధించి గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నటువంటి ప్రజలకు ఆర్థిక పరమైనటువంటి అభివృద్ధి కోసం ప్రణాళిక క్రమములు తెలియజేస్తూ ఆర్థిక లావాదేవిలు జరుపుటకు ఆర్థిక క్రమశిక్షణ పెంపొందించుటకు ప్రభుత్వం రంగ బ్యాంకులు ఎంతగానో తోడ్పతున్నాయన్నారు. ఈ బ్యాంకుల సేవల ద్వారా ప్రజలకు ఆర్థిక లావాదేవిలు మెరుగుపరుచుటకు బ్యాంకుల ద్వారా ఆర్థిక అక్షరాస్యత కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు తెలియజేశారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



ప్రకృతి వ్యవసాయాన్ని పరిశీలిస్తున్న సారా రోవర్స్

వాల్మీకిపురం: ప్రకృతి వ్యవసాయం, రసాయన వ్యవసాయాలపై తేడాను తెలుసుకొని ప్రకృతి పద్ధతిలో వ్యవసాయాన్ని పండించేందుకు ఇటలీ నుంచి సారా రోవర్స్ పంట పొలాలను పరిశీలించారు. సోమవారం మండలంలోని అయ్యవారిపల్లిలో నిర్వహిస్తున్న సేంద్రియ పంటల సాగును జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రామకృష్ణరాజు, రైతు సాధికార సంస్థ రాష్ట్ర స్థాయి అధికారి సురేంద్ర రెడ్డి ఆధ్వర్యంలో ఇటలీ నుంచి వచ్చిన సారా రోవర్స్‌కి వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏపీసీఎన్ఎఫ్ ప్రాజెక్టు ద్వారా అమలవుతున్న ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాలను అర్థం చేసుకోవడం కోసం ఆమె ఇక్కడ పరిశీలించారన్నారు. సేంద్రియ వ్యవసాయం ద్వారా పండించిన ఆహార ఉత్పత్తులను వినియోగించాలన్నారు. అయ్యవారిపల్లిలో ప్రకృతి వ్యవసాయంలో సార్వత్రిక సూత్రాల చక్రం, బీజామృతం, ఘన జీవామృతం, ద్రవ జీవామృతం, విత్తన గుళికల తయారీ అంశాలపై డెమో చేసి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది స్వాతి, పవన్, చందు, రైతులు, మహిళలు పాల్గొన్నారు.

ఈ -క్రాప్ నమోదు చేసుకోండి

నిమ్మనపల్లె: రబీ సీజన్లో వివిధ రకాల పంటలు సాగు చేసిన మండలంలోని రైతులు ఈ క్రాప్ లో పంట నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి మురళి మోహన్ తెలిపారు. సోమవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మండలం లోని 12 సచివాలయాల పరిధిలో రబీ సీజన్ కు గాను 1265 ఎకరాల్లో సాగుచేసిన పంటను 846 మంది రైతులు నమోదు చేసుకున్నారన్నారు. మిగిలిన రైతులు ఈనెల 23వ తేదీలోగా సంబంధిత రైతు భరోసా కేంద్రాలలో పంట నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలన్నారు. ఈ క్రాప్ బుకింగ్ ఆధారంగానే ప్రభుత్వ రాయితీలు అందజేయడం జరుగుతుందన్నారు. రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.